# తుది పయనం

## రెంటాల నాగేశ్వరరావు

పెద్దాసుపత్రిలో, కాజువాలిటీ వార్డ్ ముందు గంటసేపటిగా నిలబడి లోనికి చూస్తున్న జానకమ్మకు, బయటకు వస్తున్న డాక్టర్, ఆమెకేసి చూసి చిరునవ్వునవ్వకుండా, మొఖం తిప్పుకుని వినపడీ వినపడనట్లుగా 'ఐయామ్‌సారీ' అంటూనే వెళ్ళిపోవటంతో కొంపల ఏం జరిగిందో అర్థమయింది.

కాసేపటికి కాంపౌండరు బయటకు వచ్చాడు. "డాక్టరుగారెంత ప్రయత్నించినా లాభం లేకపోయిందమ్మా... మీ అబ్బాయి చనిపోయాడు..."

జానకమ్మ తాపీగా అతడికేసి చూసింది. ఆ చూపుల్లో బాధాలేదు, దుఃఖమూ లేదు. కేవలం తెలిసిన వార్తనే మళ్లీ వింటున్నట్లుగా ఉంది ఆమె భావన.

"శవాన్ని త్వరగా తీసికెళ్లమ్మా, లేకుంటే శవాల కొట్టుకి పంపాల్సివస్తుంది. అక్కడనుండి తీసికెళ్లటం చాలా లేటవుతుంది..." డాక్టరిచ్చిన 'డెత్‌సర్టిఫికేట్' ఆమె చేతిలోకుక్కి వడివడిగా వెళ్లిపోయాడు కాంపౌండర్.

అంతలో స్ట్రెచర్‌మీద శవాన్ని తీసుకొని వచ్చి, వార్డు బయటగా క్రింద పడుకోబెట్టి వెళ్ళిపోయారు వార్డ్‌బాయిస్.

ఏడేళ్ళ తన ఒకే ఒక్క కొడుకు శవం దగ్గరగా నిలబడి ముఖంలోకి చూసింది జానకమ్మ. చుట్టూ చేరినవారు ఆమెముఖాన్ని, శవం ముఖాన్ని మార్చి మార్చి చూసి, ఏదో మాట్లాడుకుంటూ వెళ్ళిపోతున్నారు.

ఏడేళ్లగా ప్రతి రోజూ చూసే తన గారాల పట్టి ముఖాన్ని, క్రొత్తగాచూస్తున్నట్లుగా చూసింది జానకమ్మ. ింపిరిగా ఉండి ప్రతిక్షణం చెదిరిపోయే జుట్టు ముఖంపైకి వాలివుంది. అలవాటుగా దానిని పైకి అనబోయిన ఆమెచేయి మధ్యలోనే ఆగిపోయింది. 'అమ్మా... అమ్మా...' అంటూ క్షణం మూతబడని పెదవులు ఒకటిగా చేరి ఉన్నా, అలా పిలువబడిన పిలుపు ఆమె చెవులకు వినిపిస్తూనే వున్నది. ఆగిపోయివున్నా, ఆ చిన్నారి గుండె చప్పుడు ఆమె గుండెలకు వినిపిస్తూనే ఉన్నది.

'శవాన్ని ఇంటికి తీసికెళ్లాలి...' అదీ ఆమె ఆలోచన. ఎండిపోయిన గుండెల వలన లూజయిన జాకెట్లో చేయిపెట్టి చిన్న కాగితపు పొట్లాన్ని బయటకు తీసింది. దానిలోని కాగితాలు తీసి లెక్కించింది. ఏడు రూపాయనోట్లు. ఆమె బ్రతుకులా నలిగి ముడతలు పడిన నోట్లు. 'కేవలం ఏడు రూపాయలతో అరవై మైళ్ళదూరాన వున్న తన గ్రామానికి కొడుకు శవాన్ని ఎలా తీసుకెళ్ళాగలను?' ఆమెకు మొదట ఉదయించిన ప్రశ్న. 'కానీ—తప్పదు.' గొణుక్కున్నట్లుగా తనలో అనుకుంది ఆమె.

త్రాగుడికి అలవాటు పడి, ఆ మైకంలో జబ్బుపడిన కన్నకొడుకుని పట్నం తీసుకెళ్ళి హాస్పటల్లో చూపించాలనే బాధ్యతను మరిస్తే, రక్తపాశం కోసం దొరికిన కొద్ది డబ్బుతో కొడుకుని పట్నం తీసుకొచ్చిందిజానకమ్మ. ఖర్చులు పోను మిగిలింది ఆ కొద్ది డబ్బే. 'తన కారణంగానే చనిపోయిన కొడుకు శవాన్ని భర్త ముందు పడేయాలి...' అన్నది ఆమె ఆలోచన. కొడుకు శవాన్ని చూశాకయినా భర్తకు కొన్ని బాధ్యతలన్నా అర్థమవుతాయేమోననేది ఆమె ఆశ మాత్రమే. అది అమెకీ తెలుసు. 'శవాన్ని చూశాక, 'బాధ' అనే వంక చూపుకుంటూ మళ్లీ సారాయికొట్టు కెళతాడు' అనికూడా ఆమెకు తెలుసు. కానీ ఏదో తెలియనికసి, కోపం, అమిత దుఃఖాన్ని బాధ్యత మూలంగా తొక్కిపట్టంతో ఏర్పడిన ఉద్రేకం ఆమెనందుకు ఆయత్తపరుస్తున్నాయి.

కొడుకు శవం కేసి ఓసారి చూసి, తనకేసి చూస్తున్న జాలి చూపులను తప్పించుకుని, గబ గబా అడుగులు ముందుకు వేసింది జానికమ్మ. ఎప్పుడైనా పట్నంవస్తే తప్పిపోతాడనే భయంతో పిల్లాడ్ని క్షణం వదిలి ఉండేదికాదామె. ఈనాడు ఎవరూ తెలియని వారి మధ్యన వదిలేసి వెళుతోంది— తప్పిపోతాడనే భయం లేదుగనుక.

**సాయంత్రం ఐదుగంటల వరకు తనకు తెలిసిన వారందరి ఇళ్లకు వెళ్లింది. చాలామంది ఇళ్ళుమారటం వలన కలియ లేదు. కొందరి ఇల్లు కనుక్కున్నా వారింట లేరు. తన ఊరి వాళ్లు ఎవరూ కనిపించ లేదు—•••!**

హాస్పటల్ గేటు బయట చిన్నగుంపు. దానిని తప్పుకు ముందుకు పోబోయింది జానికమ్మ.

"అమ్మా... అయ్యా... నాకొడుకు చనిపోయాడు బాబూ... దహనానికి డబ్బుల్లేవు... ధర్మం చేయండి బాబూ..." ఓ స్త్రీ రోదిస్తూ జనాన్ని జాలిగొలిపేలా ప్రార్థిస్తోంది. రోడ్డుపై ఓ పిల్లాడు పడుకొని ఉన్నాడు. పైన తెల్లని గుడ్డకప్పిఉంది. చుట్టూ నేలపై కొన్ని చిల్లర నాణాలు చెల్లాచెదరుగా పడిఉన్నాయి.

జాలిగా చూసింది జానికమ్మ. 'ఆమెదీ తనలాంటి నిర్భాగ్యపు బ్రతుకే కాబోలు...' ఆమె కళ్ళలో నీళ్లు తిరిగాయి. చేతిలో నలుగుతున్న ఓ రూపాయి కాగితాన్ని ఆ శవంపైకి విసిరేసింది. ఆ శవం పైతిరుగుతున్న గండు చీమను చేతితో విదిలించబోయింది కన్నతల్లి. కోపంతో కసుక్కున కొరికింది ఆ చీమ.

ఆ చిన్నారి శవం కాలు కదిలింది!

అది చూసిన నాణాలు వేయబోతున్న చేతులు తిరిగి జేబుల్లోకి వెళ్ళిపోయాయి. కొందరి కళ్ళు రంగు మారితే, కొందరి తనువులు జుగుప్సతో జలదరించాయి.

జానికమ్మకు జుగుప్సాకలుగ లేదు. కోపమూ రాలేదు. కేవలం పెదవులపై పేలవమైన చిరునవ్వు వచ్చింది. గబగబా ముందుకు కదిలింది.

ఓదార్చే వారుంటే దుఃఖము, తీర్చని వారుంటే కష్టమూ వెదుక్కుంటూ వస్తాయి. ఓదార్చేవారు లేరు కనుక దుఃఖాన్ని ఆపుకుంటూ, కష్టమొచ్చింది గనుక ఉన్నవారు తీరుస్తారనే ఆశతో కదులుతోందామె. ఆమెకు కొద్దిపాటి పరిచయం ఉన్నవారు ఒకరిద్దరున్నారు ఆ పట్నంలో. వారిని కలిసి అప్పతీసుకోవాలని ఆమె ఉద్దేశ్యం. కనీసం ఓ వంద రూపాయలన్నా తీసుకుంటే టాక్సీకాని, ఆటోకాని శవాన్ని వాళ్ల ఊరు తీసుకెళ్లటానికి వప్పుకోరు. 'వీరు అప్పు ఇవ్వలేకపోతే?' ముందుకు సాగటం లేదు ఆమె ఆలోచనలు.

సాయంత్రం ఐదుగంటల వరకు తనకు తెలిసిన వారందరి ఇళ్ళకు వెళ్ళింది. చాలా మంది ఇల్లు మారటం వలన కలవలేదు. కొందరి ఇల్లు కనుక్కున్నా వారింటలేరు. తన ఊరివాళ్ళు ఎవరూ కనిపించ లేదు— కనీసం వార్త పంపటానికయినా.

'ఏంచేయాలిక?' ఆమె మెదడు స్థంభించి పోయింది.

జానికమ్మ, చస్తూనే బ్రతుకుతూ కాలం వెళ్ల బుచ్చిన ఓ స్కూలు మాష్టారి ఐదో సంతానం. డబ్బు లేకున్నా గౌరవం ఉన్నదనుకుంటూ, ఎస్సెల్సీదాకా చదివి తప్పనిసరి పరిస్థితులలో ఓ త్రాగుబోతుకు భార్యయై అటు తండ్రి గౌరవాన్ని, ఇటు అత్తింటి

పరువునీ నిలబెట్టిన ఓ మధ్య తరగతి ఇల్లాలు. పాతికేళ్లకే నలభై దాటిన వయసు దానిలా కనిపించే జానికమ్మకు నిజానికి అమ్ముకునేందుకు రక్తమాంసాలు పోషణలేక అందము లేదు. బ్రతకటం కోసం వళ్ళమ్ముకునే తెగింపు ఆమెలో లేకున్నా, అలాటి వారంటే పరమ అసహ్యం ఆమెకు. అడుక్కుతినే వారిపై ఆమెకంతులేని జాలి ఉన్నా, ఆ పనిచేసే ధైర్యం ఆమెకు లేదు. కుహనా సంస్కారపు బురఖా తనకు తానుగా వేసుకొని, బ్రతుకు పందెంలో పోటీ పడక, పడి ఎలాగోలా బ్రతుకుతున్న వారిని అసహ్యించుకునే స్థితిలో ఉందామె. ఆత్మాభిమానం అని ఆమె భావించేదే ఆమె జీవన స్రవంతికి అడ్డుగోడయిందని ఆమెకు తెలియదు.

మున్సిపాలిటీ పంపు.నీళ్ళు త్రాగి, ముఖం కడుక్కుని, తన సమస్యను గురించి ఆలోచిస్తోందామె. 'శవాన్నిఇంటికెలా చేర్చాలా?' అని ఆలోచిస్తోందేగాని కొడుకు తనను ఎడి శాశ్వతంగా వెళ్లి పోయినందుకు దుఃఖించేఅవకాశం లేదు. లేమి ఆత్మీయతను, అనురాగాన్ని పెంచుతుందని కవులు వ్రాయగలరేమోగాని, అది
నిస్సందేహంగా వీటిని తెంపగల శక్తిని కలిగి ఉంది.

ఆలోచిస్తూనే మెల్లగా ఆ జనారణ్యంలో నడుస్తోంది. ఆమె ఆలోచన ఒకటే. అయితే దానిని సాధించే మార్గంలేదు. అడుక్కోవటమే మిగిలిన మార్గం. కానీ దానికామె మనస్సాక్షి అంగీకరించదు.

పేవుమెంటుపై పాతగోనె సంచీలు అమ్ముతున్న ఓ వ్యక్తిని చూడగానే ఆమెలో ఓ వింత ఆలోచన ప్రవేసించింది. చేతిలోని డబ్బుల్నొకసారి లెక్కించి అతడి దగ్గరికి వెళ్ళింది.

చిల్లుల్లేని ఓ పాతగోనె సంచీని ఒక రూపాయకు కొని, కొంచెం గాలి పీల్చుకొని వెను దిరిగింది జానికమ్మ.

కొడుకు శవాన్ని జాగ్రత్తగా మడిచి గోనె సంచీలో పెడుతుంటే— అక్కడున్న వారంతా ఆమెకేసి వింతగా చూశారు. ఆ చూపుల్లో జాలి, జుగుప్స ఉండి ఉండవచ్చు. కరుణ అనేది మాత్రం తప్పకుండా లేదు. ఆమె వారెవరికేసి చూడలేదు. వారి ప్రశ్నలు ఆమెకి వినిపించటం లేదు. చెప్పని ఆమె మనసు సమాధానాలు వారికీ తెలియవు. ఒక్కసారిగా చెవిటిదీ, మూగదీ, గుడ్డిదీ అయిపోయింది ఆమె. మూటగట్టిగా కట్టి, శవం చుట్టూతా తానడగకపోయినా ఎవరో వేసిన నాణాలను ఏరి గుప్పెట్లో ఉంచుకుని, ఒక్కసారిగా మూటలా భుజానికి ఎత్తుకొని కదిలింది ఆమె. ఓ రాక్షసిని చూసినట్లుగా ఆమెను చూస్తూదారి ఇచ్చారు జనం. గేటు బయట బిచ్చగానికి చేతిలోని



నాగాలు విసిరేసి, చకచకా నడవసాగింది.

కొడుకుని ప్రతిరోజూ ఆమె ఎత్తుకుంటూనే ఉండేది. నడుము చుట్టూ కాళ్ళు వేసి మెడ చుట్టూ చేతులు వేసి చెవి దగ్గరగా నోరుంచి కబుర్లు చెబుతూ మారాం చేసే గారాల బిడ్డడే నాడు అమెకు బరువనిపించలేదు. కాని ఈనాడామెకు ఎంతో బరువుగా తోచాడు. ఓ ఫర్లాంగు నడిచేసరికి రొప్పుకూడా వచ్చింది. అయినా ఆగలేదామె.

సరాసరి ఆర్టీసీ బస్ స్టేషన్‌కి వచ్చి, ప్లాట్‌ఫాంపై గోనెమూటను ఓ మూలగా దించి, తాపీగా శ్వాస తీసుకుందామె.

లేనివానికి భోజనం దొరికేంత వరకు కాలం అతినెమ్మదిగా నడిచి, దొరకగానే ఒక్కసారిగా వేగం పుంజు కుంటుంది.

జానికమ్మకు కాలం ప్రస్తుతం నెమ్మదిగా నడుస్తోంది. చీకటి పడేలోపుగా ఓ బస్సు వచ్చినాఎక్కలేదామె. ఆమెకు తెలుసు బస్సులో శవాన్ని తీసుకు పోనివ్వరని.

లాస్ట్‌బస్‌లో, అందరూ ఎక్కాక చివరగా ఎక్కబోయిందామె. "మూట పైన వెయ్యాలి" జానికమ్మ ఖరీదైన బట్టలు కట్టుకొని ఉండక పోవటంతో గద్దించినట్లు చెప్పాడు కండక్టర్. నోరు విప్పింది జానికమ్మ.

"మా ఇంటి సామాను బాబూ... పైన వేస్తే పగిలిపోతాయి..." అబద్ధమాడుతున్నందుకు ఆమె గొంతు వణికితే, అది ఆమె విధేయత అనుకున్న కండక్టర్ ఆమె రిక్వెస్ట్‌నంగీకరించినట్లుగా చూసి టిక్కెట్లివ్వటానికి లోనికెళ్లిపోయాడు.

ఇంజను వెనుకగా, సీటు ప్రక్కగా మూటను ఉంచి ప్రక్కనే సీట్లోకూర్చుంది జానికమ్మ. అరగంటలో జనాలతో నిండిపోయింది బస్. నిలబడటానికి కూడా జాగా లేనంతగా పెరిగారు మనుషులు.

తొలిచూలు బాలింత ఒకామె, అత్తారింటికెళుతూ ఆమె ప్రక్కనే నిలుచుంది చంకన బిడ్డతో.

పాలకోసం ఏడుస్తున్న బిడ్డను ప్రేమగా చూస్తూ "ఆ మూటపై కూర్చో" అన్నాడు ప్రక్కనే ఉన్న ఆమె భర్త.

'అవి ఇంటి సామానులు బాబూ...!' గొంతు పెగల్చుకుని అంటూ, లేచి తన సీటివ్వబోయింది జానికమ్మ. కాని అప్పటికే ఆమె ఆ మూటపై కూర్చుని బిడ్డను పమిటలోకి తీసుకుంది. బస్ కదిలింది.

సరిగ్గా కొడుకు వీపుమీద కూర్చున్నది ఆమె. జానికమ్మకు ఆమె తన గుండెలపై కూర్చున్నట్లు భావన కలిగింది. కొడుకు చేతులు ప్రక్కకు వంగి విరుగుతాయేమోననిపించటంతో తన చేతులు విరిగినంత బాధ వేసింది.

అంతలోనే 'టిక్కెట్' అంటూ వచ్చాడు కండక్టర్.

నోట్లుతీసి అతడి చేతిలోపెట్టి ఊరు పేరు చెప్పింది జానికమ్మ.

"మూటలో ఏముంది?" టికెట్ పంచ్ చేస్తూ అడిగాడు కండక్టర్.

"ఇంటిసామాన్లు బాబూ!"

"ఎంత బరువుంటాయి... ఇరవై కిలోలా?"

తల ఊపింది జానికమ్మ. టిక్కెట్స్ చించి, తన మామూలు పోను మిగిలిన ఓ పావలా కాసు ఆమె చేతిలో ఉంచి, గబగబా ముందువారికి టిక్కెట్లివ్వసాగాడు.

తన రహస్యం బయట పడనందుకు తృప్తిగా నిట్టూర్చబోయిన జానికమ్మ, మూటమీద బిడ్డతల్లి అటుఇటు కదులుతుండటం చూసి గుండెలు పిండినట్లుగా బాధపడుతూ దీర్ఘనిశ్వాస వదిలింది.

పెద్దగా ఏడ్వలేక పోయినా, కనీసం కన్నీటి బొట్టు కూడా రాల్చలేని నికృష్టస్థితి అది! ఆమె గుండెల సవ్వడి ఆమెకే వినిపిస్తోంది. తన తనయుని శవంపై కూర్చుని మరో తల్లి తన బిడ్డకు స్తన్యమిస్తుంటే, చూడలేక—ఓర చూపుతో చూస్తూ ఉద్వేగంతో కూర్చుండి పోయింది జానికమ్మ.

కండెక్టర్ టిక్కెట్స్ ఇవ్వటం పూర్తయేసరికి ఊరు దాటటంతో స్పీడ్ అందుకుంది బస్. లోపల లైట్లు ఆర్పేశాడు డ్రైవర్.

ఆ చీకటిలో ఎవరూ చూడలేరు గనుక, అప్పటివరకు

## నమ్మకం






కచేరీ

"మీ సంగీత కచేరీ మా పేటలో పెడదామనుకుంటున్నాం" అన్నారు సంగీత విద్వాంసుడుసదానందంతో.

"ఎందుకు! ఎప్పుడు!"

"ఓ సాయంత్రం పూట, ఎందుకంటే మా గాడిదలు కనబడటం లేదు" అన్నారు ఆ చాకలి వాళ్ళు.

—డి. ఉమామహేశ్వరరావు (కోరుకొండ)

ఆమెతొక్కిపట్టిన దుఃఖం, భరించలేని నిస్సహాయత, భయంకరమైన ఒంటరితనం ఆమెనో కన్నీటి బొట్టు విడిచి భారం తగ్గించుకోమని శాసిస్తోంది ఆమె మనసు.

ఆమె బలవంతంగా కన్నీటిని నొక్కిపట్టింది. కాని కళ్లలోకి రక్తం పొంగినట్లుగా అనిపించిందామెకు. కాలిని నెమ్మదిగా ఆ గోతపు సంచీపై వత్తిడి తగలకుండా ఉంచి, అరికాలితో మృదువుగా వ్రాయసాగింది. మధ్య గోతం ఉన్నా ఆ స్పర్శ తన తనయునిదిలా భావిస్తోందామె. చేతులతో స్పృశించలేని అసహాయతను కాళ్లద్వారా తీర్చుకుంటోంది. తగలని ఆ స్పర్శలో ఎంతో ఉద్రేకాన్ననుభవిస్తోందామె. వదులుగా ఉన్న ఆమె జాకెట్ ఒక్క సారి బిగుతుగా అయినట్లనిపించిందామెకు. ఉలిక్కిపడి పమిట సర్దుకుంటున్నట్లుగా పాలిండ్లపై చేయుంచుకుంది. ఆగ్రాలపై క్షీరంతో తడిసిన జాకెట్ వెచ్చగా తగిలిందామెకు. గుండెను ఎవరో రక్కసుడు బలవంతంగా మెలిదిప్పినట్లు, కొలిమిలో కాలుస్తూ చిత్రవధ చేస్తున్నట్లు భావన కలిగింది. భరించలేని దుఃఖభారం పెదవులను శబ్దంకోసం విడదీస్తుంటే, పళ్లతో క్రింది పెదవిని నొక్కిపట్టింది. చిట్లిన ఆ పెదవి నుండి కాక, ఆమె కళ్లలో రక్తం చిమ్మింది.

బస్ ఒక్కో స్టాప్ ఆగుతూ, జనాన్ని పెంచుకుంటూసాగుతోంది. దాదాపు సగం దూరం గడిచాక సన్నగా చినుకులు పడటం ప్రారంభమయి పెద్ద వానగా మారింది. ఆమె మనసులోని ఆవేదనలా చుట్టూ చిక్కని చీకటి. రక్కసుల్లా నిలబడ్డ మర్రి చెట్ల మధ్యగా దూసుకు పోతోంది బస్.

హఠాత్తుగా బర బర శబ్దం చేస్తూ ఆగిపోయింది బస్. వెంటనే లైట్లు ఆరిపోయాయి. కుదుపుకు



**వర్క్ ఊపిరి**

ఆఫీసులో వర్క్ చేస్తూ హఠాత్తుగా చనిపోయాడు బాబు.

“ఇంత హఠాత్తుగా పోయాడేమిటి?” అడిగాడు గిరిధర్.

“ఇవాళ ఆఫీసులో అతనికి ఊపిరి పీల్చుకోడానిక్కూడా టైమ్ లేనంత వర్కుట. బహుశా ఊపిరి పీల్చుకోడం మర్చి పోయుంటాడు” చెప్పాడు శశిధర్.

—బి.వి.ఎస్.బాబు (తెనాలి)

ముందుకు తూలిన బాలింతరాలు, ఓ చేత్తో బిడ్డను పట్టుకుంటూ, మరో చేత్తో గోనె సంచీని పట్టుకుంది కుదుపు తట్టుకోవటం కోసం. జానికమ్మ బ్రతుకులా చిరికి పోయిన ఆ గోనె పట్ట వ్వరున చినిగింది. నొక్కిపట్టి ఉంచటంతో కాబోలు క్రూరవాని చేయి విసురుగా బయటకు వచ్చింది. ఏదో బయటకు వచ్చిన భావన కలగటంతో, చేయుంచి తడిమిందామె. మంచులా తగిలిన ఆ చేతిపై ఆమె చేయి ప్రాకుతూ వేళ్ల తగ్గరికి వచ్చేసరికి, అదో చేయి అని, తాను కూర్చున్నది మనిషి మీద—కాదు శవం మీద అని అర్థం అయిందామెకు. భయంతో, తెలియని ఉద్రేకంతో, పిచ్చిగా 'కెవ్వు'న కేక వేసిందామె. అందరూ ఉలిక్కిపడి అటు చూశారు. హఠాత్తుగా బస్ ఆగటం, లైట్లుపోవడం, బయట కుంభవృష్టి, భయంతో కూడిన స్త్రీకేక—ఒక్కసారిగా జరగటంతో గుండెలు జలదరించాయి ప్రయాణీకులకు.

ఒక్క క్షణం స్మశాన నిశ్శబ్దం. దగ్గరకు జరిగిన ఆ స్త్రీభర్త అగ్గిపుల్ల గీశాడు. వికృతంగా గోనెసంచీనుండి బయటకు వచ్చిన చేతిని చూసిన వారి గుండెలు ఝల్లుమన్నాయి. జుగుప్సతో, భయంతో వళ్ళు జలదరించాయి.

బిడ్డనెవరో అందుకుంటే, మూర్ఛపోయిన భార్యను లేవదీశాడామె భర్త హడావిడిగా!

మరో క్షణం నిశ్శబ్దం. బయట హోరుగాలి, లోపలికి విసురుగా తోసుకొస్తున్న వర్షపునీరు...

'గోనె సంచీలో శవం...' 'హత్య...' ఎవరో గొణగగా క్షణంలో బస్ అంతా వ్యాపించింది. ఒక్కసారిగా ఉలిక్కిపడి లేచారు జనం. అయితే వాన పడుతుండటంతో ఎవరూ బస్ దిగలేదు.

నిశ్చేష్టమై కూర్చుండి పోయింది జానికమ్మ. ఎవరో వేసిన టార్చిలైట్ వెలుగులో చినిగిన పట్ట, దానిలోంచి బయటపడిన శవం కన్పిస్తున్నాయి. అందరూ దూరంగా నెట్టుకుంటూ జరిగారు. ఆ వెలుగులో పళ్ళు బిగబట్టి నిద్రిస్తున్నట్లుగా ఉన్న కొడుకు ముఖాన్ని చూస్తోంది జానికమ్మ.

ఒక్కసారిగా బస్‌లో రణగొణధ్వని మొదలైంది. కొందరాడవారు వణుకుతుంటే, కొందరేడుస్తున్నారు. అందరి గుండెలూ భయంతో వేగంగా కొట్టుకుంటున్నాయి. బిడ్డను గుండెల కదుముకొని తమకు ధైర్యం తెచ్చుకుంటున్నారు కొందరు తల్లులు. భయంతో ఊపిరి పీల్చటం మర్చిపోయారు మరి కొందరు.

వారిని తప్పుకుని ముందు కొచ్చిన కండక్టర్, గోనె సంచీని చూడగానే జానికమ్మకేసి తిరిగాడు.

“ఏవే ముండా! ఎవర్ని చంపి బస్‌లో తెస్తున్నావ్?' ఉద్రేకంతో కంపించిందతడి స్వరం.

'చంపటం'అనే మాట బస్‌లో ఎక్కువ మనందిని భయపడేలా చేసింది. ఒకరిద్దరు స్త్రీలు భయంతో కేక వేశారు.

వేగంగా వీచే గాలికి బస్ ఊగుతోంది. కిటికీలలోంచి, అద్దాలమధ్యనుండి వాన నీరు చిమ్ముకొస్తోంది. మెరుపుల శబ్దం ఆ సమయంలో మరింత భయంకరంగా అనిపిస్తోంది.

భార్యకు స్పృహ రాగానే కొంచెం తెప్పరిల్లిన బాలింత మొగుడు విసురుగా జానికమ్మ జుట్టుపట్టుకున్నాడు.

“ఏవే లం...చంపేసిన శవాన్ని బస్‌లో తెస్తావా? ఎంత తెగించిన దానివే...” గబగబా వీపుపై రెండు గుద్దు లేశాడు. మరెవరో మరో రెండు...

రెండు నిముషాలు గడిచేసరికి క్రమంగా నిశ్శబ్దత వ్యాపించింది. ప్రళయపు ముందు గంభీరత చోటుచేసుకుంటోంది.

ఏం చేయాలిపుడు?

ఎవరికీ తట్టటం లేదు. ఉద్రిక్తత, జుగుప్స అందరిలో నెలకొని ఉంది. మెల్లిగా వంగి కొడుకు నుదురుపై పడిన జుత్తును వెనుకకు తోసింది జానికమ్మ.

వానకు కూడా ఢడవని కొందరు క్రిందకు దిగారు. ఏం చెడి పోయిందో కూడా చూడకుండా అక్కడనే చేరాడు డ్రైవర్.

“ఎవర్నో చంపి బస్తాలో మూటగట్టి తీసుకెళుతోంది రాక్షసి... పాపం చిన్న పిల్లాడిలా ఉన్నాడు. ఎవరి పిల్లాడో...” ఎవరో అన్నారు.

జానికమ్మ తలవంచుకొని కొడుకు ముఖంకేసే చూస్తోంది. టార్చి వెలుగులో నిగనిగా అందంగా మెరుస్తోందతడి ముఖం.

ఆమె ఓ నరరూప రాక్షసిలా కన్పిస్తోందందరి కళ్లకూ. ఆమెపై ద్వేషం, జుగుప్స, చెప్పరానంత అసహ్యం, చుట్టూవున్న వారందరిలో వున్నాయి.

అవమానంతో, దుఃఖభారంతో, నికృష్ట దశకు కలిగిన ఉద్రేకాన్ని భరించలేక పోతోంది జానికమ్మ. వళ్లంతా ఎగిరెగిరి పడుతోంది. ఉచ్ఛ్వాసనిశ్వాసలు వేగంగా ఉన్నాయి.

“క్రిందికి తోయండి దొంగముండని...” ఎవరో అన్నారు.


ఎవరో ఆమెను మెడబెట్టి నెట్టారు. విసురుగా ముందుకు పడిందామె. ఆమె తల ధన్‌మని శబ్దం చేస్తూ ముందు సీట్‌రాడ్‌కి తగిలి, క్రిందకు జారి పిల్లవాని తలకు తగిలింది. టార్చి వెలుగులో ఆమె తలనుండి చిమ్మిన రక్తం బిడ్డనుదుటి మీదగా కారుతూ కనిపిస్తోంది.

“శవాన్ని—దాన్ని బయటకు తోయండి... బస్‌ని నెట్టుకుని ముందుకు పోదాం.... తరువాత బాగు చేసుకోవచ్చు...” ఎవరో అన్నారు. కొందరు వానలోనే క్రిందకు దిగారు.

అంతవరకు మౌనంగా గమనిస్తున్న ఓ యువకుడు ఆమె దగ్గరకు వచ్చాడు. ఆమె ప్రక్కగా పడిన కాగితాన్నందుకొని టార్చి వెలుగులో చూశాడు. 'లా'ఈ మధ్యనే పాసై పట్నంలో ప్రాక్టీస్ పెట్టిన వ్యక్తి అతను. ఆమెను క్రిందకు నెట్టటానికి కదిలిన వ్యక్తిని చూసి చేత్తో ఆపాడు అతను.

“ఆగండి... ఆమెను దించటానికి వీల్లేదు... ఈ వానలో, ఈ చీకట్లో ఒంటరి ఆడగూతురు శవాన్ని పెట్టుకుని ఎలా ఉండగలదు? ఏం చేయగలదు? మీకు జాలి లేదూ? ఇదేం న్యాయం?”ఖంగున ధ్వనించింది అతడి స్వరం.

చూపి. శంకర్ బాబు



"ఏలయ్యా! బోలా మాట్లాడుతున్నావ్? అదెవర్నో చంపి తెస్తుంటే, దాన్ని బస్‌లో రానివ్వాలా? అందుకు నీ సపోర్ట్? కావాలంటేను ప్యా దిగు అంత జాలుంటే— అది మాత్రం బస్‌లో ఉండటానికి వీల్లేదు—" ఒకాయనన్నాడు. చాలా మంది ఆయనకే అనుకూలంగా మాట్లాడారు.

"ఆమె ఎవర్నో చంపేసుంటే—కేసవుద్ది. ఘనమునంతా ఇరుక్కుపోతాం. పోలీసులు కోర్టులు ఎందుకీ గొడవలు... దాన్ని దింపేసి పోతే దాని దార్నది సస్తది. మనకెందుకు లేనిపోని గొడవ?" మరెవరో అన్నారు.

"ఎందుకు దింపాలి? కావాలంటే బస్ వెనుకకు తీసుకెళ్ళి సరాసరి పోలీస్ స్టేషన్ దగ్గర దింపండి. ఆమే టిక్కెట్ కొన్నది. బస్‌లో ప్రయాణం చేసే హక్కు ఆమెకూ ఉంది. ఆమూటకీ టికెట్ కొట్టారు... ఆమెను ధింపటానికి వీల్లేదు. కావాలంటే మీరేదిగిపోండి." విసురుగా అన్నాడా యువకుడు.

"శవానికి టిక్కెట్?.." ఎవరో నవ్వారు... "అదేం సామానా?"

"శవాన్ని బస్‌లో తీసుకెళ్లటానికి వీల్లేదు... దించెయ్యండి..." కండక్టర్ గద్దించిపలికాడు.

"చూడండి కండక్టర్ గారూ!" కుర్రలాయర్ అందుకున్నాడు "నిషిద్ధ వస్తువులు, ప్రేలుడు సామాన్లు మాత్రమే. బస్‌లో తీసుకెళ్లగూడదు అని రూల్స్ ఉన్నాయి. శవాన్ని తీసుకు పోకూడదని 'రిటెన్'గా రూలుందా?"

"నిషిద్ధ వస్తువులంటే—శవం కూడా దానిలోకే చేరుతుంది" అరిచినట్లుగా అన్నాడు కండక్టర్.

"కానీ... ఈ బస్‌లో ప్రయాణం చేసే వారెవరయినా దారిలో చనిపోతే, 'టిక్కెట్‌కొన్న శవాన్ని దింపేస్తారా మధ్యలో? దింపరుగదా? అలా అయితే శవ ప్రయాణానికి అంగీకరించినట్లేగదా?" రెట్టించాడు లాయర్. అవాక్కయాడు కండక్టర్.

"ఆమె చేసింది హత్య అనుకుంటే— నీవు ఆమెనిక్కడ దింపటానికి వీల్లేదు. బస్ ఆపేసి పోలీసులకు కబురంపాలి. కాని— ఆమె హత్య చేయలేదు. ఆమె కన్న కొడుకు హాస్పటల్లో చనిపోతే— డబ్బులేక కాబోలు ఇలా కొడుకు శవాన్ని ఇంటికి తీసుకెళ్తోంది. దానికి జాలి పడాలిగాని అవమానించటంకాదు మనం చేయాల్సింది... ఇదో 'డెత్‌సర్టిఫికేట్' చూడండి..." టార్చి వెలుగులోకి ఇంధాకటి కాగితాన్ని తెస్తూ అన్నాడా యువకుడు.

బస్సంతా ఒక్కసారిగా నిశ్శబ్దమయిపోయింది.

"అయ్యోపాపం! ఆమె కొడుకేనా? హాస్పటల్లో చనిపోతే డబ్బులేక, వేరే గతిలేక శవాన్ని ఇలా తెచ్చుకుంటుందా?"

అంతవరకు ఆమెపై ఉన్న ద్వేషం, జుగుప్సనశించి ఒక్కసారిగా సానుభూతి పెరిగింది. ఆమెను గుర్తించినా, అంతవరకు గుర్తించనట్లుగా ఉన్న ఆమె ఊరి ప్రయాణీకులు అప్పుడు నోరు విప్పి, ఆమె బీదరికానికి ఋజువులు చెప్పారు. అందరూ ఆమెకు జరిగిన బాధ గురించి ఆలోచిస్తున్నారు.

జానికమ్మను లేపి ఆమె సీటల్లో కూర్చోబెట్టటానికని, ఆమెను కొడుకు శవం పైనుండి భుజాలు పట్టుకు లేపబోయాడు కండక్టర్. నిర్జీవంగా వాలిపోయిందామె. చనిపోబోయేముందు వెలువడ్డదేమో— ఆమె కనుకొసన నిలిచిన ఓ కన్నీటి బిందువు క్రిందకు జారుతూ టార్చి వెలుగులో మిల మిలా మెరుస్తూ కొడుకు చెక్కిలిపై రాలింది.

నిర్ఘాంత పోయాడు కండక్టర్.

"ఇది నిస్సందేహంగా హత్యే! మనమందరం హంతకులం... కానీ ఏ కోర్టూ మనకు శిక్ష విధించలేదు..." గొణిగాడు కుర్రలాయర్.

"మన దేశంలో ప్రభుత్వపు ఖర్చుతో దహన సంస్కారాలు ఇద్దరికే జరుగుతాయి. ఒకరు అత్యంత ఉన్నత
పదవిలో ఉన్నవారైతే, మరొకరు ఇలాంటి వారు..." గొణుక్కున్నట్లుగా అనుకున్నాడతను. భోరున ఏడుస్తున్నట్లుగా వానకురుస్తూనే వుంది. *



ఫలాలు

"తినడానికి పనిక్రి రాని ఫలాలు ఏమిటో చెప్పు" అన్నాడు కృష్ణ.

"వారఫలాలు" ఠక్కున చెప్పాడు రాము.

—కె.వి.సత్యనారాయణ మూర్తి
(కొండసముద్రం)


తెల్ల మచ్చలకు చికిత్స



తీవ్రమైన ఒక పరిశోధన తరువాత తెల్ల మచ్చలను బాగు చేసేందుకు గాను మా మందు కనిపెట్టబడింది చికిత్సను గనుక పూర్తిగా పొందుతే మచ్చల రంగు మారి శరీరానికి మునుపటి రంగు తిరిగి వస్తుంది. జబ్బు మొదళ్ళలో నుండి కూడా పూర్తిగా నయమౌతుంది. మీరు నిరాశ చెందినట్లయితే తప్పకుండా ఈ చికిత్సను పొందండి. మా చికిత్సను పూర్తిగా పొందినట్లయితే ప్రచారణకై ఒక ఫైల్ ఉచితంగా ఇవ్వబడుతుంది. రోగుల వయస్సుతో సహా జబ్బు పూర్తి వివారాలను వ్రాయండి.

దాంపత్య జీవితాన్ని ఆనందించండి



బాల్యంలో చేసిన పొరపాట్లకు లేక మరి ఏ ఇతర కారణాలకు గాని లోనై సిగ్గుతో మీ బలహీనతను ప్రదర్శించలేక దాంపత్య జీవితంలో ఎటువంటి అనందభరితమైన సుఖాన్ని అనుభవించ లేక పోతున్నారా...అయితే రహస్యమైన మీ జబ్బు యొక్క పూర్తి వివరాలను వ్రాయండి. దాంపత్య జీవితంలో గల నిజమైన సుఖాన్ని అనుభవించేందుకు సలహాలను పొందండి.

తెల్ల వెంట్రుకలు మరియు వెంట్రుకలు రాలిపోవుట

జుట్టును డై చెయ్యనవసరం లేదు మా ఆయుర్వేద చికిత్స (ఆయిల్) వల్ల తెల్ల వెంట్రుకలు మామూలు నలుపు రంగులోనికి మారి స్థిరంగా నిలుస్తాయి. జుట్టు రాలిపోకుండా కాపాడి జుట్టు రాలిన ప్రదేశాన కొత్త జుట్టు వస్తుంది. ఇది మెదడును చల్ల పరుస్తుంది. ఒక కోర్సులో 3 ఫైల్స్ ధర రూ. 35/- పోస్టేజి మరియు ప్యాకింగ్ అదనం.

**SHYAM AYURVED BHAVAN (AB)**
***P.O. KATRI SARAI (GAYA) PIN : 805 105***



